క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో చిన్నారికి తీవ్ర గాయాలు

గుంటూరు రూరల్: రోడ్డు ప్రమాదంలో చిన్నారికి తీవ్ర గాయాలైన సంఘటన నల్లపాడు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ వంశీధర్ తెలిపిన వివరాల ప్రకారం.. నల్లపాడు కాలువ సెంటర్‌కు చెందిన చిన్నారి లాస్య తల్లితో కలిసి గ్రామంలోని గుడికి వెళ్లి వస్తున్నారు. ఈ క్రమంలో పేరేచర్ల వైపునుంచి అతివేగంగా వస్తున్న కారు రోడ్డుపై నడుస్తున్న లాస్యను ఢీకొంది. తీవ్ర గాయాలు కాగా అదే కారులో చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. మెరుగైన చికిత్సల నిమిత్తం అక్కడి నుంచి ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. సంఘటనపై బాధితురాలి తండ్రి చల్లగుళ్ల రఘురామ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సీనియర్ సిటిజన్స్ భాగస్వాములు కావాలి

నగర కమిషనర్ పులి శ్రీనివాసులు

నెహ్రూనగర్: గుంటూరు నగరాభివృద్ధిలో సీనియర్ సిటిజన్స్ భాగస్వాములు కావాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు గురువారం ఒక ప్రకటనలో కోరారు. అభివృద్ధి పనులపై విలువైన అభిప్రాయాలు, సూచనలు అందించడానికి శుక్రవారం సాయంత్రం 4 గంటలకు నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. గుంటూరు నగరం రాజధాని ప్రాంతంలో ఉందని, అదే రీతిలో నగరాభివృద్ధికి నగరపాలక సంస్థ పలు అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా పలు ప్రాజెక్టల నిర్మాణాలకు ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిందని పేర్కొన్నారు. విజన్ 2047లో గుంటూరు నగరాభివృద్ధికి చేపట్టాల్సిన వివిధ ప్రాజెక్టలపై సీనియర్ సిటిజన్స్ సలహాలు, సూచనలు ఇవ్వాలని కమిషనర్ కోరారు.

ఆస్తి గొడవలతో మనస్తాపం చెంది వ్యక్తి ఆత్మహత్య

పట్నంబజారు: ఆస్తి గొడవల నేపథ్యంలో వ్యక్తి మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడిన సంఘటనపై కేసు నమోదైంది. కొత్తపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శీలంవారి వీధిలో నివాసం ఉండే సీహెచ్.శ్రీనివాసరావు (38) ఓ ప్రిటింగ్ ప్రెస్‌లో పని చేస్తున్నాడు. బంధువులతో ఆస్తి వివాదానికి సంబంధించి కోర్టులో కేసు నడుస్తోంది. దీంతో మనస్తాపానికి గురైన శ్రీనివాసరావు గురువారం కొత్తపేట పాతపోలీసు స్టేషన్ సమీపంలోని తల్లిదండ్రుల నివాసానికి వెళ్లి, ఇనుప రాడ్‌కు చీరతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉప గ్రహాల అనుసంధానం ఇస్రో చరిత్రలో మైలురాయి

గుంటూరు ఎడ్యుకేషన్: అంతరిక్షంలో ఉప గ్రహలను అనుసంధానం (డాకింగ్) చేయడంలో ఇస్రో శాస్త్రవేత్తలు సఫలీకృతులయ్యారని చిల్డ్రన్స్ స్పేస్ క్లబ్ ఆఫ్ ఇండియా వ్యవస్థాపకుడు జి. శాంతమూర్తి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. భారతదేశ అంతరిక్ష పరిశోధన రంగంలో ఉపగ్రహాలను అనుసంధానించడం గొప్ప మైలురాయి అని పేర్కొన్నారు. ఉప గ్రహలను డాకింగ్ చేయడంలో మన దేశం నాలుగో స్థానంలో నిలిచిందని తెలిపారు. భవిష్యత్తులో ఇస్రో మరెన్నో గొప్ప విజయాలను సాధించి, భారతదేశ ప్రతిష్టను ప్రపంచానికి చాటి చెబుతుందని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా శాంతమూర్తి ఇస్రో శాస్త్రవేత్తలకు అభినందనలు తెలియజేశారు.

శిథిల వంతెన..రాకపోకలకు యాతన




తుంగభద్ర కాలువపై ప్రమాదకరంగా ఉన్న వంతెన

- తుంగభద్ర కాలువపై ప్రమాదకరంగా వంతెన
- బీటలు వారిన గోడలు
- దెబ్బతిన్న రెయిలింగ్

పొన్నూరు: మండల పరిధిలోని వడ్డిముక్కల గ్రామ సమీపంలోని తుంగభద్ర కాలువపై వంతెన శిథిలావస్థకు చేరింది. చింతలపూడి నుంచి వడ్డిముక్కల, జడవల్లి, కోమలి, రెడ్డిపాలెం, కర్లపాలెం మండలానికి వెళ్లే ప్రజలు ఈ వంతెనపై నుంచి రాకపోకలు సాగిస్తుంటారు. నిత్యం అనేక వాహనాలు ఈ వంతెన మీదుగానే వెళుతుండడంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని ఆ ప్రాంతవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సుమారు మూడు దశాబ్దాల కిందట అప్పటి అవసరాలకు అనుగుణంగా ఇక్కడ వంతెన నిర్మాణం చేపట్టారు. ఏళ్ల తరబడి తాత్కాలిక మరమ్మతులకు కూడా నోచుకోకపోవడంతో వంతెన శిథిలావస్థకు చేరింది. భారీ వాహనాలు సైతం ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తున్నాయి. రాత్రి వేళల్లో వాహనాలు ఢీకొని వంతెనకు ఇరు వైపులా ఉన్న రెయిలింగ్ పూర్తిగా దెబ్బతింది. గోడలు సైతం బీటలు వారడంతో పరిస్థితి ప్రమాదకరంగా మారింది. వాహనచోదకులు ఈ వంతెనపై రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. కనీసం రెయిలింగ్ కూడా లేకపోవడంతో ప్రయాణం చేసేందుకు భయాందోళనకు గురవుతున్నారు. ప్రస్తుతం పరిస్థితి మరింత దిగజారింది. అధికారులు స్పందించి వంతెన నిర్మాణ పనులు ప్రారంభించాలని స్థానికులు కోరుతున్నారు.

జిందాల్ ప్లాంట్‌ను సందర్శించిన డీఎంఏ

గుంటూరు రూరల్: ఘన వ్యర్థాల నిర్వహణ పటిష్టంగా, ప్రణాళికాబద్ధంగా చేపట్టినప్పుడే రోజువారి ఉత్పత్తి అవుతున్న చెత్త సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని రాష్ట్ర పురపాలక సంచాలకులు (డీఎంఏ) హరి నారాయణన్ తెలిపారు. నాయుడుపేటలోని జిందాల్ అర్బన్ వేస్ట్ మేనేజ్మెంట్ ప్లాంట్‌ని గురువారం నగర కమిషనర్ పులి శ్రీనివాసులు, పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ జి. సూరజ్‌లతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎంఏ జిందాల్ ప్రతినిధులతో సమావేశమయ్యారు. ప్లాంట్ సామర్థ్యం, అవసరమైన వ్యర్థాలు, మున్సిపాల్టీల నుంచి వస్తున్న చెత్త, విద్యుత్ ఉత్పత్తి తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. నగరపాలక సంస్థ, మున్సిపాలిటీల్లో వ్యర్థాల నిర్వహణ పెద్ద సమస్యగా ఉందని తెలిపారు. ఉత్పత్తి అవుతున్న వ్యర్థాలను ఒక చోట డంప్ చేయడం ద్వారా స్థలాభావ సమస్య కూడా ఎదురవుతుందని చెప్పారు. అనంతరం ప్లాంట్‌లోని యంత్రాలను పరిశీలించారు. కార్యక్రమంలో జిందాల్ ప్రాజెక్ట్ ఏపీ ప్రెసిడెంట్ ఎం.వి. చారి, ఎస్ఈ నాగమల్లేశ్వరరావు, సీఎంఓహెచ్ డాక్టర్ అమృతం, ఈఈ సుందరరామిరెడ్డి, డీఈఈ సతీష్ పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న డీఎంఏ హరినారాయణన్

నవ్వుల నెలరాజు 'జంధ్యాల'కు ఘననివాళి

లక్ష్మీపురం: హాస్య చిత్రాల దర్శకుల్లో అగ్రగణ్యుడు జంధ్యాల అని అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, డాక్టర్ వి.వి రామ్‌కుమార్ అన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో గురువారం జంధ్యాల జయంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నవ్వుల నెల రాజుగా జంధ్యాల ప్రసిద్ధి చెందారని తెలిపారు. సునిశిత హాస్యంతో పలు పాత్రలకు రూపకల్పన చేశారని పేర్కొన్నారు. సంస్థ సభ్యులు, రంగస్థలం నటుడు పి.ఘనశ్యామాచార్యులు, మిమిక్రీ కళాకారుడు కృష్ణారెడ్డి, అంకమ్మరావు, ప్రసాదరావు పాల్గొన్నారు.

సంక్రాంతి వేడుకల సందడి

అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో సంక్రాంతి వేడుకల్లో భాగంగా మూడో రోజు కార్యక్రమాన్ని సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఆధ్వర్యంలో మిమిక్రీ, మెజీషియన్ కళాకారుడు ఆర్.పి.ఎల్ నరసింహారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హాస్యం ఆప్తమిత్రుడి వంటిదని తెలిపారు. సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, డాక్టర్స్ కామెడీ క్లబ్ కన్వీనర్, లాఫింగ్ థెరపిస్ట్ డాక్టర్ వి.వి. రామ్ కుమార్ మాట్లాడుతూ 'నవ్వు-ఆరోగ్యంగా ఉండు' అనే మాటను అందరూ గుర్తుంచుకోవాలని తెలిపారు. నవ్వు ఉద్వేగాన్ని, ఉద్రేకాన్ని తగ్గిస్తుందని చెప్పారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. సంస్థ సభ్యులు, సీనియర్ సిటిజన్స్, పెన్షనర్స్ అసోసియేషన్ సభ్యులు భాగ్యలక్ష్మి, రమణ, వి.వి.రావ్, గుప్త పాల్గొన్నారు.



జంధ్యాల చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పిస్తున్న సంస్థ సభ్యులు

అలరించిన గాత్ర సంగీత కచేరి

నగరంపాలెం: స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై డాక్టర్ మంగళంపల్లి బాలమురళీకృష్ణ ప్రభుత్వ సంగీత నృత్య పాఠశాల ఆధ్వర్యంలో గురువారం కర్ణాటక గాత్ర సంగీత కచేరి నిర్వహించారు. ఆలయ కమిటీ సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు, పాఠశాల నిర్వాహకులు జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. లంకా తేజస్విని (విజయవాడ) హంసధ్వని రాగం, ఆది తాళంలో వాతాపి గణపతిం భజేతో కచేరీ ప్రారంభించారు. పలు వాగ్గేయకారుల కీర్తనలు ఆలపించారు.వయోలిన్‌పై ఎ.కామాక్షి (హైదరాబాద్), మృదంగంపై అరవింద్ (చెన్నై) వాయిద్య సహకారాన్ని అందించారు.

భీమ్ భారత్ రాష్ట్ర అధ్యక్షుడు పాగళ్ల ప్రకాష్‌కు ఘన నివాళి



నెహ్రూనగర్: దళిత, బహుజనుల సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలు చేస్తున్న భీమ్ భారత్ రాష్ట్ర అధ్యక్షుడు పాగళ్ల ప్రకాష్ (62) అకాల మృతి విచారకరమని పలు దళిత, బహుజన, ప్రజాసంఘాల నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. లాడ్జి సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద గురువారం పాగళ్ల ప్రకాష్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా పలువురు మాట్లాడుతూ దళిత, బహుజనులకు ఏ సమస్య వచ్చినా ముందుండి పరిష్కారానికి ఉద్యమాలు చేసే నేతను కోల్పోవడం బాధాకరమని తెలిపారు. దళిత బహుజన సంఘాల నాయకులు నల్లప నీలాంబరం, డాక్టర్ గోళ్లమూడి రాజసుందరం బాబు, చిన్నం డేవిడ్ విలియమ్స్, పాల్గొన్నారు.

వ్యక్తిపై దాడి

లక్ష్మీపురం: పాత కక్షల నేపథ్యంలో ఓ వ్యక్తిపై ఇనుప రాడ్డుతో దాడి చేయడంతో గాయపడిన ఘటన పట్టాభిపురం పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీ కృష్ణదేవరాయనగర్‌కు చెందిన అల్లం లక్ష్మీనారాయణ కార్పెంటర్ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అదే నివాసంలో పక్క గదిలో వేముల దుర్గారావు నివాసం ఉంటున్నాడు. గతంలో ఓ కేసులో లక్ష్మీనారాయణ, దుర్గారావుకు వ్యతిరేకంగా సాక్ష్యం చెప్పాడు. దీన్ని మనస్సులో పెట్టుకుని లక్ష్మీనారాయణ ఇంటి వద్ద ఒంటరిగా ఉన్న సమయంలో దుర్గారావు బుధవారం రాత్రి ఇనుప రాడ్డుతో దాడి చేశాడు. గాయపడిన లక్ష్మీనారాయణను కుటుంబ సభ్యులు ప్రభుత్వ సమగ్రాసుపత్రికి తరలించారు. చికిత్స అనంతరం లక్ష్మీనారాయణ పట్టాభిపురం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు దుర్గారావుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రణాళికబద్ధంగా చదివితే ఉత్తమ ఫలితాలు

చేబ్రోలు: విద్యార్థులు ప్రణాళికబద్ధంగా చదివితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని మండల విద్యా శాఖాధికారి రాయల సుబ్బారావు అన్నారు. చేబ్రోలు మండలం నారాకోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు సెలవుల్లో జరుగుతున్న శిక్షణ తరగతులను గురువారం ఆయన పరిశీలించారు. విద్యార్థులకు పలు సూచనలు చేశారు. స్లో లెర్నర్స్ కోసం నిర్వహిస్తున్న అదనపు ప్రత్యేక తరగతులను పరిశీలించారు. పాఠశాలలో ప్రభుత్వం ప్రకటించిన వంద రోజుల యాక్షన్ ప్లాన్ అమలు తీరును పరిశీలించారు. ఎస్సీఈఆర్టీ రూపొందించిన మూడు నమూనా ప్రశ్న పత్రాలను అనుసరించి వాటిని సాధన చేయించాలని ఉపాధ్యాయులకు సూచించారు. దత్తత తీసుకున్న విద్యార్థులపై వ్యక్తిగత పర్యవేక్షణ చేయాలని తెలిపారు. పబ్లిక్ పరీక్ష రాసే విధానంలో పాటించవలసిన మెలకువలను వివరించారు. ప్రత్యేక శిక్షణ తరగతులకు విద్యార్థులంతా క్రమం తప్పకుండా హాజరై ఉపాధ్యాయల సేవలను వినియోగించుకోవాలని ఎంఈఓ సూచించారు. ఉపాధ్యాయులు కూడా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం ద్వారా పాఠశాలలో ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సీహెచ్. నాగేశ్వరరావు, ఈ. మాధవీలత, ఎం. వెంకటేశ్వరరావు, కృష్ణారావు, విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఈవో రాయల సుబ్బారావు

పారిశుద్ధ్య పనులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

కమిషనర్ పి.శ్రీనివాసులు

గుంటూరు రూరల్: నగరంలో పారిశుద్ధ్య పనులు పిన్ పాయింట్ మేరకు నూరు శాతం జరిగేలా ప్రజారోగ్య అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. ఆయన గురువారం గోరంట్ల, రెడ్డిపాలెం, ఇన్నర్ రింగ్ రోడ్, నగరాలులోని పలు ప్రాంతాలను పరిశీలించి, ప్రజారోగ్య అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ శానిటేషన్ కార్యదర్శులు తమ సచివాలయం పరిధిలో నూరు శాతం పనులు జరిగేలా బాధ్యత వహించాలని తెలిపారు. ఉదయం ఇంటింటి చెత్త సేకరణ అనంతరం మధ్యాహ్నం గ్యాంగ్ వర్క్ ద్వారా డ్రెయిన్లలో పూడికతీత, సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రత్యేక పారిశుధ్య పనులు చేపట్టాలని ఆదేశించారు. రోడ్ల పక్కన వ్యర్థాలు లేకుండా అవసరమైతే ట్రాక్టర్లను ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. పర్యటనలో డీఈఈ రమేష్ బాబు, ఏఈలు, శానిటరీ ఇన్‌స్పెక్టర్‌లు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.



గోరంట్లలో పనులు పరిశీలిస్తున్న కమిషనర్ శ్రీనివాసులు

చిట్టడవులను తలపిస్తున్న ఖాళీ స్థలాలు

పొన్నూరు: పట్టణంలో ఇళ్ల మధ్యలో ఖాళీ స్థలాలు చిట్టడవులను తలపిస్తున్నాయి. పెరిగిన పిచ్చి మొక్కలు, మురుగు నీటితో దోమలకు ఆవాసాలుగా మారాయి. దీంతో పరిసర ప్రాంతాల ప్రజలు వ్యాధులకు గురవుతున్నారు. మున్సిపల్ కార్యాలయానికి కూతవేటు దూరంలోని ప్రాంతాల్లో నివాసాల మధ్య ఖాళీ స్థలాల్లో పిచ్చిమొక్కలు విరివిగా పెరిగాయి. స్థలాల యజమానులు శుభ్రం చేయకపోవడంతో చిన్నపాటి అడవులను తలపిస్తున్నాయి. ఖాళీ స్థలాల్లో మురుగు నీరు రోజుల తరబడి నిల్వ ఉండడంతో దోమల వ్యాప్తి అధికంగా ఉంది. ఖాళీ స్థలాలను శుభ్రం చేయించాలని స్థల యజమానులు, మున్సిపల్ అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా ఫలితం లేకుండా పోతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి పిచ్చి మొక్కలను తొలగించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



మున్సిపల్ కార్యాలయం వెనుక వీధిలో పెరిగిన చెట్లు

జీజీహెచ్‌కు మాస్కులు అందజేత

గుంటూరు మెడికల్: జీజీహెచ్‌కు గురువారం జింఖానా కో- ఆర్డినేటర్ డాక్టర్ వెనిగండ్ల బాలభాస్కరరావు, డాక్టర్ పి.వి.హనుమంతరావులు ఎన్95 మాస్కులు, ఎగ్జామినేషన్ డిస్పోజబుల్ గ్లౌజులను అందజేశారు. జీజీహెచ్ అభివృద్ధికి జింఖానా అందిస్తున్న సేవలు వెలకట్టలేనివని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ యశశ్వి రమణ కొనియాడారు. జీజీహెచ్ అభివృద్ధికి ఎంతో మంది దాతలు, స్వచ్ఛంద సంస్థలు, పారిశ్రామికవేత్తలు ముందుకు వచ్చి సాయం చేస్తున్నారని తెలిపారు. అందరి సహకారంతో ఆసుపత్రిని అభివృద్ధి చేసి పేదలకు మెరుగైన వైద్య సేవలు అందజేస్తామని సూపరింటెండెంట్ వెల్లడించారు.



మాస్కులు అందజేస్తున్న డాక్టర్ బాలభాస్కరరావు, డాక్టర్ హనుమంతరావు

వైద్య కళాశాలకు డస్ట్ బిన్‌ల వితరణ

గుంటూరు మెడికల్: గుంటూరు వైద్య కళాశాలకు గురువారం గుంటూరు వారితోట 1వ లైనుకు చెందిన ఎల్.ఎస్.ప్లాస్టిక్స్ అధినేత కాకుమాను శ్రీనివాసరావు డస్ట్‌బిన్‌లను వితరణ చేశారు. వైద్య కళాశాల ఆవరణ పరిశుభ్రంగా ఉంచేందుకు, చెత్తను ఎక్కడంటే అక్కడ వేయకుండా డస్ట్‌బిన్‌లలో పడేసేలా కళాశాలలోని అన్ని ప్రాంతాల్లో ఏర్పాటు చేసినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ నాగార్జునకొండ వెంకట సుందరాచారి తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రభాకరరావు పాల్గొన్నారు.



శ్రీనివాసరావును అభినందిస్తున్న డాక్టర్ సుందరాచారి

త్యాగయ్య ఆరాధనోత్సవాలు ప్రారంభం

నగరంపాలెం: స్థానిక లక్ష్మీపురం రెండో వీధిలోని శ్రీత్యాగరాజస్వామి కళావేదికపై గురువారం సద్గురు శ్రీ త్యాగరాజస్వామి 178వ ఆరాధనోత్సవాలు వైభవంగా ప్రారంభించారు. శ్రీ త్యాగరాజ సాంస్కృతిక సంఘం కార్యదర్శి వల్లూరి కృష్ణకిశోర్ ఆధ్వర్యంలో ఈనెల 20వ తేదీ వరకు కొనసాగనున్నాయి. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఇన్‌కంట్యాక్స్ చీఫ్ కమిషనర్ (విజయవాడ) వి.మోహతా మాట్లాడుతూ సంగీత అనుబంధ కార్యక్రమాలకు హాజరుకావడం ఆనందంగా ఉందని తెలిపారు. చిరస్మరణీయుడైన త్యాగ బ్రహ్మను స్మరిస్తూ, 47 ఏళ్లుగా సంగీత సభలను కొనసాగిస్తున్న సంస్థను అభినందించారు. అనంతరం లఘు కచేరీ జరిగింది. డాక్టర్ ఏ. కోదండరామయ్య, టి.ఆర్.చాందిని, గ్రాహ్య, సరయూశ్రీ మాల్కోస్, కె.నాగలక్ష్మి త్యాగరాజ కీర్తనలను ఆలపించారు. సంస్కృతి గుంటూరు ఆధ్వర్యంలో వేమూరి రామలక్ష్మికి త్యాగరత్న బెంగళూరు నాగరత్నమ్మ పురస్కారం ప్రదానం చేశారు. శాస్త్రీయ సంగీత కచేరీలో చాగంటి కిరణ్మయి (చెన్నై) త్యాగరాజ కీర్తనలను అలపించారు. వాయులీనంపై బి.వి.దుర్గా భవాని, మృదంగంపై కె.సద్గురుచరణ్ సహకారాన్ని అందించారు. కార్యక్రమంలో సీఏ గబ్బిట శివ రామకృష్ణప్రసాద్, సంస్థ అధ్యక్షులు డాక్టర్ రామరాజు శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు ఎస్.గిరిజాశంకర్ పాల్గొన్నారు. చివరగా అతిథిలను సత్కరించారు.



వేమూరి రామలక్ష్మికి అవార్డు ప్రదానం

- **రైలులో ప్రయాణికుడు మృతి**

తెనాలిరూరల్: రైల్లో ప్రయాణికుడు మృతి చెందాడు. గూడూరు-విజయవాడ రైలులో గురువారం ప్రయాణిస్తున్న గుర్తు తెలియని ప్రయాణికుడు మృతి చెందాడన్న సమాచారంతో రైలు తెనాలి స్టేషన్‌కు చేరుకోగానే జీఆర్పీ పోలీసులు మృతదేహాన్ని రైలు నుంచి దింపించారు. మృతుడి వయసు 45 నుండి 50 ఏళ్ల మధ్య ఉంటుంది.

జీర్ణకోశ వ్యాధులకు కార్పొరేట్ వైద్యం

- జీజీహెచ్‌లో అత్యాధునిక వైద్య పరికరాలతో సేవలు
- ఖరీదైన ఆపరేషన్లు కూడా ఉచితం
- త్వరలోనే లివర్ మార్పిడి ఆపరేషన్లు

గుంటూరు మెడికల్: అన్నం మింగుడుపడక, మంచినీరు తాగలేక అవస్థలు పడుతూ తీవ్ర అనారోగ్యానికి గురైన మహిళకు గుంటూరు జీజీహెచ్ సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్యులు అరుదైన ఆపరేషన్ చేసి వ్యాధి నుంచి విముక్తి కల్పించారు. మచిలీపట్నానికి చెందిన వెంకట మహాలక్ష్మి గత నాలుగేళ్లుగా అన్నం తినలేక ఇబ్బందులు పడుతోంది. గత ఏడాది డిసెంబరులో గుంటూరు జీజీహెచ్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ ఓపీ వైద్య విభాగానికి వచ్చింది. సర్జికల్ గ్యాస్ట్రోఎంట్రాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ అందె కోటి వెంకటేశ్వరరావు వైద్య పరీక్షలు చేసి, ఎక్సాషియా కార్డియాగా నిర్ధారించారు. డిసెంబరు 24న మూడు గంటల సేపు ఆపరేషన్ చేసి వ్యాధి నుంచి విముక్తి కల్పించారు. ఎండోస్కోపీ ద్వారా కోత, కుట్లు లేకుండా అత్యాధునిక వైద్య పరికరాలతో రూ. 3 లక్షలు ఖరీదు చేసే ఆపరేషన్‌ను ఉచితంగా చేశారు.

కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా సేవలు

గుంటూరు జీజీహెచ్ గ్యాస్ట్రోఎంట్రాలజీ వైద్య విభాగంలో జీర్ణ కోశ, ఉదర సంబంధిత వ్యాధులకు కార్పొరేట్ వైద్య సేవలను ఉచితంగా అందిస్తున్నారు. కార్పొరేట్ ఆసుపత్రులకంటే దీటుగా పేద రోగులకు అత్యాధునిక వైద్య పరికరాలతో ఉచితంగా సేవలు లభిస్తున్నాయి. వేలాది రూపాయల ఖరీదు చేసే మందులను సైతం పూర్తి ఉచితంగా అందిస్తూ పేదోళ్లకు కొండంత భరోసాగా నిలుస్తున్నారు. మెడికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజీతోపాటుగా సర్జికల్ గ్యాస్ట్రోఎంట్రాలజీ వైద్య సేవలు కూడా ఎనిమిది నెలలుగా అందుబాటులోకి వచ్చాయి. రూ. పది లక్షల ఖరీదు చేసే ఆపరేషన్లు సైతం పూర్తి ఉచితంగా చేస్తున్నారు.

ప్రతిరోజూ 120 మందికి వైద్యం

జీజీహెచ్‌లో గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్య విభాగంలో ఓపీ విభాగం 15 నంబరు గదిలో వైద్య సేవలు అందిస్తున్నారు. వారంలో ఒకరోజు మెడికల్ గ్యాస్ట్రోఎంట్రాలజీ, ఒకరోజు సర్జికల్ గ్యాస్ట్రోఎంట్రాలజీ వైద్యులు అందుబాటులో ఉంటూ సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు పేదలకు ఉచితంగా అందిస్తున్నారు. ప్రతిరోజూ 100 నుంచి 120 మంది వివిధ రకాల జీర్ణకోశ, ఉదర సంబంధిత వ్యాధులతో చికిత్స పొందుతున్నారు. ఓపీ విభాగంలో శస్త్రచికిత్సలు అవసరమైన వారిని గుర్తించి ఇన్‌పేషెంట్ విభాగంలో అడ్మిట్ చేసుకుంటున్నారు. ఆధునిక వైద్య పరికరాలతో విజయవంతంగా శస్త్రచికిత్సలు నిర్వహిస్తున్నారు.



జీజీహెచ్‌లో గ్యాస్ట్రో ఎంట్రాలజీ వార్డు

లభించే వైద్య సేవలు

- అల్సర్, క్యాన్సర్, పేగుపూత వ్యాధులకు ఎండోస్కోపి, కొలనోస్కోపి ద్వారా వైద్య సేవలు
- కడుపునొప్పి, గ్యాస్ సమస్యలు, రక్తపు వాంతులు, రక్తపు విరోచనాలు, ఆకలి తగ్గడం, రక్తహీనత ఉన్నవారికి పరీక్షలు చేసి వైద్యం అందిస్తున్నారు.
- అన్నవాహిక, పొట్ట, చిన్నపేగు, పెద్దపేగులో క్యాన్సర్ వల్ల అడ్డుపడి ఇబ్బంది ఎదురైనప్పుడు స్టంట్ అమర్చి, ఆహారం అడ్డుపడకుండా సాధారణ వ్యక్తి మాదిరిగా తినగలిగేలా చికిత్స.
- పసరుతిత్తి నాళంలో రాళ్లు, కామెర్లు, జ్వరం రావడం, క్యాన్సర్‌లో నొప్పిరావడం వంటి సమస్యలు ఉన్నవారికి ఈఆర్‌సీపీ చికిత్సలో రాళ్లను తొలగించి పసికర్లు తగ్గిస్తున్నారు.
- ఏపీసీ విధానంలో ఎండోస్కోపి ద్వారా రక్తహీనత, పొట్ట నుంచి రక్తం పోవడం, విరేచనంలో రక్తం, బంకపడడం వంటి సమస్యలను నివారిస్తున్నారు.
- ఆహారం మింగుడు పడకపోవడం, గొంతులో లేదా ఛాతీలో అడ్డుపడటం, ఛాతీలో మంట లేదా తీవ్ర నొప్పి, ఇబ్బందికరంగా తేపులురావడం, మలబద్ధకం, అన్నవాహిక, పొట్ట, విరేచన ద్వారంలో చలనం, ఒత్తిడి ఏర్పడినప్పుడు మ్యానోమెట్రీ ద్వారా కొలిచి సమస్యను గుర్తించి చికిత్స అందిస్తున్నారు.
- ఛాతీలో విపరీతమైన నొప్పి, మంట, ఇబ్బందికరంగా తేపులు రావడం ఉన్నవారికి, పరీక్షలు చేసినా వ్యాధి అంతుపట్టని సమయంలో జబ్బును కచ్చితంగా నిర్ధారించేందుకు 24 గంటలు పీహెచ్ అండ్ ఇంపెడెన్స్ మెట్రీ పరీక్ష చేసి నిర్ధారిస్తున్నారు.
- రూపాయి బిళ్లలు, బ్యాటరీలు, సూదులు, పిన్నులు, చేప ఎముకలు, అన్నవాహికలో అడ్డుపడిన మాంసపు ముక్కలు, ప్రమాదవశాత్తు పిల్లలు వస్తువులు మింగిన సమయంలో ఎండోస్కోపి ద్వారా ఆపరేషన్ చేసి విజయవంతంగా వాటిని బయటకు తీస్తున్నారు.



అరుదైన ఆపరేషన్ చేసి రోగి ప్రాణాలు కాపాడిన గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్యులు(ఫైల్)

ఆధునిక జీవన శైలితో వ్యాధులు



ఆధునిక జీవన శైలి వల్ల జీర్ణ కోశ, ఉదర సంబంధిత వ్యాధులు బాగా పెరిగిపోతున్నాయి. ఫాస్ట్‌ఫుడ్స్ ఎక్కువగా తినడం, ఇంట్లో వంట చేయడం మానేసి హోటళ్లలో తెప్పించుకుని తినడం, చిరుతిళ్లు తినడం ద్వారా ఆరోగ్య సమస్యలు పెరిగిపోతున్నాయి. నిర్ణీత వేళకు భోజనం చేయకపోవడం, కొవ్వు అధికంగా ఉన్న ఆహార పదార్థాలు ఎక్కువగా తీసుకోవడం, కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు, ఆహారంలో పూర్తిగా తగ్గించడం ద్వారా జీర్ణకోశ వ్యాధులు పెరుగుతున్నాయి. పండ్లు బాగా తినాలి. ప్రతిరోజూ శారీరక వ్యాయామం చేయడం ద్వారా జీర్ణకోశ వ్యాధుల బారిన పడకుండా ఉండవచ్చు.

– అనుముల కవిత, గ్యాస్ట్రోఎంట్రాలజీ విభాగాధిపతి, గుంటూరు జీజీహెచ్

పేదలకు ఉచిత వైద్యసేవలు



గుంటూరు జీజీహెచ్ గ్యాస్ట్రోఎంట్రాలజీ వైద్య విభాగంలో కార్పొరేట్ ఆస్పత్రుల కంటే దీటుగా ఉచితంగా వైద్యసేవలు అందిస్తున్నారు. ప్రైవేటు, కార్పొరేట్ ఆసుపత్రులు నిరాకరించే కేసులను సైతం అడ్మిట్ చేసుకుని చికిత్స అందిస్తున్నాం. పదిలక్షలకు పైగా ఖరీదు చేసే ఆపరేషన్లు సైతం పూర్తి ఉచితంగా చేసి పేద రోగుల ప్రాణాలు కాపాడుతున్నాం. త్వరలోనే లివర్ మార్పిడి ఆపరేషన్లు జీజీహెచ్‌లో చేసేందుకు రంగం సిద్ధం చేస్తున్నాం.

– డాక్టర్ యశశ్వి రమణ, గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్